క్లుప్తంగా

ఉద్యోగ నియామక పత్రాల అందజేత



విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు నియామక పత్రాలు అందించామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష‌బాబు నియామక పత్రాలు అందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ముగిసే సమయానికి రాయల్ ఎన్‌ఫీల్డ్, విస్టన్ ఇన్ఫోకామ్, టీఈ కనెక్టివిటి తదితర కంపెనీల్లో 109 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. అధ్యాపకులు హేమాంజ, బాలజోషి, కళ్యాణి, ప్లేస్‌మెంట్ అధికారి జసింథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'జుమ్మతుల్ విదా'



జకాత్, ఫిత్రాపై వివరిస్తున్న ఇమామ్ హజ్రత్ బాబ్జాన్

ఎన్పీకుంట: ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం(జుమ్మతుల్ విదా) ను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. రంజాన్ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలను గొప్పవిగా భావిస్తారు. ఈ మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని స్వర్గం చేరేందుకు అత్యంత పుణ్యదాయకమైన మార్గంగా నమ్ముతారు. ×జుమ్మతుల్ విదా౯ సందర్భంగా మండల కేంద్రంలోని జామియా, మామూర్ మసీదులతో పాటు మండలంలోని పలు మసీదులలో ప్రత్యేక నమాజు చేశారు. జామియా మసీదులో ప్రభుత్వ ఖాజీ, ఇమామ్ హజ్రత్ బాబ్జాన్ (యూసుఫ్) ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత విశేషాలు, రంజాన్ మాసం విశిష్టతను తెలియజేశారు. పండుగ రోజు కంటే ముందు నిరుపేదలకు జకాత్, ఫిత్రా నగదును అందించి వారికి సహకరించాలని సూచించారు. అనంతరం సమస్త మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: విశ్వహిందూ పరిషత్, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన తెలుగు క్యాలెండర్‌ను బత్తలపల్లిలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ బత్తలపల్లి ప్రకండ అధ్యక్షుడు కేశవ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు ఆంగ్ల సంవత్సారన్ని కాకుండా తెలుగు సంవత్సరాదిని జరుపుకోవాలన్నారు. విశ్వహిందూ పరిషత్ బత్తలపల్లి అధ్యక్షులు కొమ్మినేని వెంకటేష, సమరసత సేవా ఫౌండేషన్ బత్తలపల్లి అధ్యక్షుడు సాకే గోపాల్, గో సంరక్షకుడు పవన్‌కుమార్ యాదవ్, చిరంజీవినాయుడు, యోగాపంద ఆచారీ, ఈశ్వర్‌చంద్ర ప్రసాద్, ప్రతాప్, శేఖర్, మండల నారాయణ, కొంకా కాశప్ప, ముసలప్ప తదితరులు పాల్గొన్నారు.

తోటల సంరక్షణలో మెలకువలు పాటించండి



మాట్లాడుతున్న హెచ్ఓ ప్రతాప్‌రెడ్డి

తలుపుల: మామిడి తోటల సంరక్షణలో మెలకువలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి రైతులకు సూచించారు. వేపమానిపేట గ్రామంలో శుక్రవారం ఆయన మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి తోటల్లో పిందెదశలో ఉన్న చెట్లకు పేడ ఎరువు, సూపర్ పాస్పేట్, పొటాష్, జింకు, బోరాన్‌లను వేసి నీటిని పారబెట్టాలన్నారు. తద్వారా పిందెలు రాలడం తగ్గి కాయ సైజు, నాణ్యత పెరుగుతుందన్నారు. మామిడి తోటలలో ఎక్కడైనా నల్లతామర, రసం పీల్చు పురుగులు ఉంటే తొలుత లీటరు నీటిలో 3.5 ఎంఎల్ వేపనూనె పిచికారీ చేయాలన్నారు. అయినా తగ్గకపోతే 0.3 ఎంఎల్ ఇమిడా క్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. వీహెచ్ఓలు రాజేష్, తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

డేంజర్ జర్నీ..



గుంతలు పడిన బీడుపల్లి రోడ్డు

- ఆధ్యాత్మిక నగరంలో రోడ్లు అధ్వానం
- దెబ్బతిన్న వెస్ట్‌గేట్, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి రోడ్లు
- ప్రయాణికుల అవస్థలు పట్టని అధికారులు, ప్రజా ప్రతినిధులు

పుట్టపర్తి టౌన్: పురపాలక సంఘం పరిధిలో పలు రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పల్లె పండుగ పేరిట మరమ్మతులు చేపట్టినా రోజుల వ్యవధిలోనే గుంతలు తేలాయి. ఆయా మార్గాల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. జిల్లా కేంద్రం, ఆధ్యాత్మిక కేంద్రం అయిన పుట్టపర్తికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, దేశవిదేశాల నుంచి సత్యసాయి భక్తులు వస్తుంటారు. అంతేకాదు సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు పొందేందుకు దేశ నలుమూలల నుంచి రోగులు వస్తుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోజూ పుట్టపర్తికి రాకపోకలు సాగిస్తుంటారు. మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు, దాదాపు 40 వేల జనాభా ఉంది. పుట్టపర్తి, ప్రశాంతినిలయం, కమ్మవారిపల్లి, వెస్ట్‌గేట్ మీదుగా మెయిన్ రోడ్డు కలిపేలా రింగ్‌రోడ్లు ఏర్పాటు చేశారు. గతంలో ఎప్పుడో వేసిన తారు రోడ్ల మీదుగానే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. పుట్టపర్తి, కమ్మవారిపల్లికి చెందిన వాహనదారులు వెస్ట్ గేట్ మీదుగా ప్రశాంతి గ్రాం వైపు ప్రయాణిస్తుంటారు. జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత సత్యసాయి దీనజనోద్ధరణ భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో దాదాపు 500 మీటర్ల మేర రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అక్కడక్కడ కంకర తేలి గుంతలు పడ్డాయి.

తారుమారి.. కంకర తేలి..

పుట్టపర్తి నుంచి ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లి తండా మీదుగా ప్రశాంతి గ్రాం వద్ద మెయిరోడ్డులోకి కలుస్తుంది. బ్రాహ్మణపల్లి వద్ద మూడు వార్డులు కలుపుతూ సచివాలయం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి వీఐపీల పర్యటన, సత్యసాయి బాబా జయంత్యుత్సవాల సమయంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద నుంచి బ్రాహ్మణపల్లి ఎనుములపల్లి మీదుగా వాహనాలు దారి మళ్లిస్తారు. అలాంటి మార్గంలో తారురోడ్డు కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఇక సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నుంచి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి, బడేనాయక్, తండా, గోనేనాయక్ తండా మీదుగా కోదూరు రోడ్డు కలుపుతూ 20 కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేశారు. ఈ మార్గంలో విద్యాసంస్థలు, జగనన్న కాలనీలు ఉండడంతో రాకపోకలు అధికంగా ఉంటాయి. ఇంతటి రద్దీగా ఉండే రోడ్డులో కంకర తేలి రెండు అడుగులకు ఒక గుంత ఏర్పడింది. ×పల్లె పండుగ౯లో తూతూ మంత్రంగా గుంతలు పూడ్చినా మళ్లీ పరిస్థితి మొదటికొచ్చిందని వాహనదారులు వాపోతున్నారు.



గుంతలమయంగా మారిన బ్రాహ్మణపల్లి రోడ్డు

ప్రయాణం.. భయం భయం



పుట్టపర్తి మున్సిపాలిటీలో బ్రాహ్మణపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వాహనాలు రాకపోకలు సాగించడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రోడ్డు మరమ్మతులు చేపట్టలేదు. రాత్రి పూట ప్రయాణించాలంటే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం.

– సోముశేఖర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి

పట్టించుకునేవారేరీ?



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నుంచి బీడుపల్లి వెళ్లే రహదారి కంకర తేలడంతో ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. ద్విచక్రవాహనాలు తరచూ రిపేరీ వస్తున్నాయి. ఈ రోడ్డు దుస్థితి గురించి ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోలేదు.

– రంగారెడ్డి, బీడుపల్లి

భూ రీసర్వేతో బహుళ ప్రయోజనాలు

ఎన్పీకుంట: భూముల రీసర్వేతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తహసీల్దార్ దేవేంద్రనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వంకమద్ది, పెడబల్లి పంచాయతీ కేంద్రాల్లో శుక్రవారం భూముల రీసర్వేపై రైతులతో ర్యాలీ నిర్వహించి, గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేలో ఏళ్ల తరబడి పరిష్కారం కాని ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జిలాని, ఆర్ఐ శ్రీధర్, వీఆర్ఓ అనూషా, గ్రామసర్వేయర్లు ఉపేంద్ర, ప్రసన్నకుమారి, రైతులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

ముదిగుబ్బ: మహిళపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. ముదిగుబ్బకు చెందిన రమణమ్మ ఓ ప్రేమ జంటకు ఆశ్రయమిచ్చారనే కోపంతో కడప జిల్లా వేంపల్లికు చెందిన ప్రభాకర్, రవితో పాటు మరో ఇద్దరు శుక్రవారం ఆమెపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలు 13కు వాయిదా

నల్లమాడ: ఆర్.రామాపురం వద్ద నున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలను ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలను ఏప్రిల్ 6న నిర్వహించనున్నట్లు ముందుగా ప్రకటించిన ప్రభుత్వం అనివార్య కారణాల వల్ల అదేనెల 13కు వాయిదా వేసిందని పేర్కొన్నారు. 13న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4–30 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

నైతిక విజయం వైఎస్సార్‌సీపీదే



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి

కదిరి: గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక విషయంలో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. గాండ్లపెంట మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలుండగా అందులో 6 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారని, టీడీపీ కేవలం ఒకే ఒక్క స్థానంలో గెలిచిందన్నారు. అలాంటి చోట టీడీపీ నాయకులు ఎంపీపీ పదవిని ఆశించడం ఎంత వరకు కరెక్ట్? అన్నారు. అక్కడ తమ పార్టీకే చెందిన ఎంపీపీ జగన్‌మోహన్ తన వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేయడంతో ఎంపీపీ ఎన్నిక వచ్చిందన్నారు. ఎంపీపీ ఎన్నికకు గురువారం తమ పార్టీ ఎంపీటీసీలు అక్కడికి హాజరవుతుంటే పోలీసులు కావాలనే వారిని అడుగడుగునా అడ్డుకొని సమయానికి అక్కడికి చేరుకోకుండా టీడీపీకి సహకరించారని ఆరోపించారు. సంబంధిత పోలీసు అధికారులు ఖాకీ వదిలి పసుపు చొక్కా వేసుకుంటే మంచిదని మండిపడ్డారు. కూటమి పాలనలో ఈ వ్యవస్థలపై నమ్మకం లేకనే తమ పార్టీ ఎంపీటీసీలు రెండో రోజు ఎంపీపీ ఎన్నికకు హాజరు కాలేదని, దీంతో కోరం లేక ఎంపీపీ ఎన్నిక నిరవధికంగా వాయిదా పడిందన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని భయ భ్రాంతులకు గురి చేసినా ఐదుగురు ఎంపీటీసీలు జగనన్నకు అండగా నిలిచారని వారందరినీ అభినందిస్తున్నానని చెప్పారు. కిడ్నాప్ పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించి ఎంపీపీ కుర్చీని టీడీపీకి కట్టబెట్టేందుకు వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. అధికార కూటమి ప్రభుత్వానికి ఏడాది తిరక్కుండానే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని, భవిష్యత్‌లో ఏ ఎన్నిక జరిగినా 'ఫ్యాను' గిరగిరా తిరగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నమ్మకం లేకనే ఎన్నిక బహిష్కరించాం

ఎంపీపీ ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా జరగదనే అనుమానంతోనే తమ పార్టీ ఎంపీటీసీలు హాజరు కాకుండా బహిష్కరించారని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయ కర్త మక్బూల్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. టీడీపీ నాయకులు తమ పార్టీకి చెందిన ఒకరిద్దరు ఎంపీటీసీలను కొనుక్కున్నంత మాత్రాన వైఎస్సార్‌సీపీ బలహీన పడుతుందనుకోవడం టీడీపీ నాయకుల మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఎంపీటీసీలను కిడ్నాప్ చేశారని తనతో పాటు తమ పార్టీకి చెందిన మరికొందరిపై పోలీసులు తప్పుడు కేసు పెట్టారని, తమను ఎవ్వరూ కిడ్నాప్ చేయలేదని వారే స్వయంగా పోలీసులకు చెప్పడంతో వాస్తవమేంటో ప్రజలకు తెలిసిపోయిందన్నారు.

మామిడి రైతులను ఆదుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

తలుపుల: మండలంలో రైతులు వేలాది ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశారని, ఈ ఏడాది పూత దశలోనే పంటకు తీవ్రనష్టం వాటిల్లిందని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ రఫీనాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ప్రభుత్వం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించిందని, రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పశుగ్రాసం, దాణా అందజేయాలన్నారు.వర్షాభావ పరస్థితుల్లో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని, తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని సభ్యులు అధికారులను కోరారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలున్నా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ లోకనాథరెడ్డి, సర్పంచ్‌లు షేక్షావలి, పెద్దినాయుడు అధికారుల తీరుపై మండిపడ్డారు. గ్రామాల్లో పశువుల తాగునీటి సౌకర్యార్థం నీటి తొట్టెలు మంజూరయ్యాయని, వీటిని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీపీ సూచించారు. మండలంలో కట్టలు దెబ్బతిన్న 5 చెరువులకు కట్టల మరమ్మతు పనులు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ ఏఈ అనీల సభ దృష్టికి తెచ్చారు. వైద్యాధికారి అఫ్తాప్, ఎంఈఓ వెంకట్రాముడు, ఏఓ షాదాబ్, ఆర్ఐ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ రికార్డు హర్షణీయం



రికార్డు ధ్రువపత్రాలను ప్రదర్శిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్, అధికారులు

ధర్మవరం: మహిళా సంఘాల ఉత్పత్తులను వావ్ జెనీ అనే యాప్ ద్వారా విక్రయించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం హర్షణీయమని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అనంతపురం మెప్మా కార్యాలయం నుంచి పంపిన గిన్నిస్ బుక్ రికార్డు ధ్రువపత్రాన్ని మెప్మా సిబ్బందికి కమిషనర్ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా ఒక్కరోజే వావ్ జెనీ యాప్ ద్వారా రెండు లక్షలకుపైగా విక్రయాలు చేసినందుకు అవార్డు దక్కిందన్నారు. ధర్మవరం మెప్మా పరిధిలో 2458 సంఘాలుండగా 1000 మంది సభ్యులు తమ ఉత్పత్తులను విక్రయించారని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు, సీఓలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ

ఓడీచెరువు: మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు సుబ్బారావు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో 705 మంది విద్యార్థులకు గాను ఐదుగురు మాత్రమే గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

వెదురు మొక్కల పెంపకంపై శిక్షణ



వెదురు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న డీహెచ్ఓ చంద్రశేఖర్

ముదిగుబ్బ: నాగారెడ్డిపల్లిలో శుక్రవారం నేషనల్ బ్యాంబో మిషన్ సహకారంతో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వెదురు మొక్కల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతు సుబ్రమణ్య గుప్త పొలంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి. చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. వాణిజ్య పరంగా వెదురు మొక్కల పెంపకం చేపడితే ప్రభుత్వం ఒక హెక్టార్‌కు రూ.50వేలను సబ్సిడీగా అందిస్తుందన్నారు. ఈ ప్రాంతానికి అనువైన వెదురు రకాలు గురించి రైతులకు వివరించారు. ఒక హెక్టారుకు 400 మొక్కలు నాటుకోవచ్చన్నారు. హెచ్ఓలు అమరేశ్వరి, లావణ్య, యామిని, ఏఓ లక్ష్మీనరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్య తీర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం: ఏలుకుంట్ల గ్రామంలో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని ఏపీ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూటూరు మహేంద్ర విన్నవించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నటరాజ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలుకుంట్ల గ్రామంలో సర్వే నంబర్ 94లో 86 సెంట్ల వంక పోరంబోకు స్థలం ఉందని అందులో గ్రామానికి చెందిన మాల కులస్తులు శ్మశాన వాటికగా ఉపయోగించుకుంటున్నారన్నారు. గ్రామానికి చెందిన అమర నారాయణ, రామానాయుడు స్థలాన్ని ఆక్రమించుకుని మాల కులస్తులు ఎవరైనా చనిపోతే అక్కడ పూడ్చకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. ఉగాది పండుగ అనంతరం గ్రామానికి వచ్చి శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేయించి కంచె ఏర్పాటు చేయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు మహేంద్ర తెలిపారు. ఏలుకుంట్ల గ్రామస్తులు ప్రకాష్, పుష్పరాజ్, కుళ్లాయప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తనకల్లు: గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి తిరుపతిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలు ...స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కిష్ట (56) అన్నమయ్య జిల్లా అంగళ్లులో టీ కేఫ్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం రోజుల క్రితం కేఫ్‌లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో కిష్ట తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

వాహనాల రాకపోకలు బంద్

ధర్మవరం అర్బన్: ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో శనివారం నుంచి రెండురోజులపాటు పీఆర్‌టి సర్కిల్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకు వాహనాల రాకపోకలు బంద్ చేయనున్నట్లు వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి టౌన్: రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వివేకానంద రోడ్డులో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు ఉండేవారు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 3 గంటలపైన బయటకు వెళ్లాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు వెంట తీసుకుపోవాలన్నారు. మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మంజుల, ఉమ పాల్గొన్నారు.

డ్రిప్పు పైపులు దగ్ధం

తనకల్లు: పరాకువాండ్లపల్లికి చెందిన రైతు శేఖర్‌కు చెందిన డ్రిప్పు పైపులు శుక్రవారం దగ్ధమయ్యాయి. వివరాలు... గ్రామానికి చెందిన రైతు శేఖర్ తన పొలంలో డ్రిప్పు పైపులను ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. అయితే ఆకతాయిలు గుట్టకు నిప్పు పెట్టడంతో సమీపంలోని పొలంలోకి మంటలు వ్యాపించాయి. దాంతో పొలంలో ఉన్న డ్రిప్పు పైపులు కాలి బూడిదయ్యాయని, రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

పుట్టపర్తి టౌన్: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గురువారం రాత్రి బీడుపల్లికి చెందిన రైతు చిన్నప్పయ్య గారి గోవిందరెడ్డి పొలంలో మామిడి చెట్లతో వ్యవసాయ పరికరాలు దగ్ధమయ్యాయి. 50 మామిడి చెట్లు, డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయని రైతు వాపోయాడు.

'రాప్తాడులో రాక్షస పాలన'

పుట్టపర్తి టౌన్: రాప్తాడులో రాక్షస పాలన రాజ్యమేలుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రామగిరి ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీకి బలం లేకపోయినప్పటికీ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులపై దౌర్జన్యాలకు దిగి ఎంపీపీ పదవిని దక్కించుకోవాలని ఎమ్మెల్యే సునీత కుట్రలు పన్నుతోందన్నారు. గతంలో ఆమె పేరూరు డ్యాంకు నీళ్లు తెస్తామని చెప్పి రూ.800 కోట్లతో పనులు ప్రారంభించి ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. పేరూర్ డ్యాంకు రొద్దం మండలం తురకాలాపట్నం నుంచి పెన్నానది ద్వారా సొంత నిధులతో నీళ్లు తెచ్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఐదేళ్లుగా ప్రశాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఫ్యాక్షన్ చిచ్చు రేపుతోందన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



గురుస్వామికి రూ.లక్ష విరాళం అందిస్తున్న కౌన్సిలర్ కేతా లోకేష్

ధర్మవరం అర్బన్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కేతా లోకేష్ రూ.లక్ష విరాళాన్ని అందించారు. పట్టణంలోని కౌన్సిలర్ నివాసంలో శుక్రవారం గురుస్వామి పీజే విజయ్‌కుమార్‌కు రూ.లక్ష నగదును కౌన్సిలర్ అందించారు. ఈసందర్భంగా కౌన్సిలర్‌ను గురుస్వామి అభినందించారు.



విరాళం అందజేస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

రామాలయానికి విరాళం

నల్లచెరువు: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి కంబదూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లచెరువుకు చెందిన భీమ్ శెట్టి ఈశ్వరయ్య శుక్రవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, పడుచూరి నగేష్, వేమయ్య, కేసీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి



కదిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. నాయకులు బాబ్జాన్, ముస్తక్, జగన్మోహన్, రామ్మోహన్, సుధాకరరెడ్డి, నారాయణ, గంగప్ప, అంజనేయులు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్‌వీధిలోనున్న విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేసి ఏడీకి వినతిపత్రం అందించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నేతలు మారుతి, ఎస్‌హెచ్ భాష, సీఐటీయు నాయకులు జీవీ రమణ, అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ కార్మికులు, ప్రజలు, రైతులకు నష్టం కలిగించే విద్యుత్ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎల్. ఆదినారాయణ, హైదర్‌వలి, వెంకటస్వామి, హరి, ఖాదర్‌బాషా, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నల్లమాడ: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, నాయకులు తహసీల్దార్ రంగనాయకులుకు వినతిపత్రాన్నిఅందజేశారు. నాయకులు మణికంఠ, వెంకటరామన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇంధనపు సర్దుబాటు, ట్రూ అఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోందని మండల సీపీఎం నాయకులు తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కదిరప్ప డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పుట్టపర్తి టౌన్: విద్యుత్ చార్జీల పెంపుతోపాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఇన్‌చార్జ్ తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి పాల్గొన్నారు.